
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రాజన్న సిరిసిల్ల
జిల్లా వార్తలు
5★★★
సోమవారం 3 మార్చి 2025





వైకుంఠ రథం వితరణ

ఇల్లంతకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాలిపల్లిలో రెడ్డి వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైకుంఠ రథాన్ని ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ముస్కు రమణారెడ్డితో పాటు 10 మంది సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం అధ్యక్షుడు సింగిరెడ్డి కరుణాకర్‌రెడ్డి, సెస్‌డైరెక్టర్ మల్లుగారి రవీందర్‌రెడ్డి, నాయకులు సింగిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పుల్లుగారి చంద్రారెడ్డి, మాధవరెడ్డి, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

సంజీవయ్యనగర్ యువజన సంఘం కార్యవర్గం

సిరిసిల్ల టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవయ్యనగర్ యువజన సంఘం నూతన కార్యవర్గంను ఆదివారం ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కూకట్ల కిషన్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా పెరుమాండ్ల ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా రెడ్డిమల్ల అనిల్, కోశాధికారిగా కోడి కృష్ణ, సహాయ కార్యదర్శి బిట్ల శేఖర్, ప్రచార కార్యదర్శిగా పెరుమాండ్ల జయంత్, గౌరవ అధ్యక్షుడిగా పెరుమాండ్ల రాములు, బిట్ల రాములు, లీగల్ అడ్వైజర్‌గా రెడ్డిమల్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం జరిగింది. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యానారాయణ, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, నాయకులు హాజరై కార్యవర్గాన్ని సన్మానించి అభినందించారు.

అంగన్‌వాడీలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

చందుర్తి, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) : పదవి విరమణ పొందిన అంగన్వాడి టీచర్లకు, ఆయాలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు అన్నారు. చందుర్తి మండలం తిమ్మాపూర్ గ్రామంలో ఇటీవల మృతి చెందిన అంగన్‌వాడీ ఆయా మూడపెల్లి దేవమ్మ కుటుంబాన్ని మండలంలోని ఏఐటీయూసీ అనుబంధ ఆయాలు ఆదివారం పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్‌వాడీ టీచర్లకు రూ. 2 లక్షలు, ఆయాలకు లక్ష రూపాయలు ఇవ్వాలన్నారు. పదవీ విరమణ పొందిన బెనిఫిట్స్ అందించ డంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాత్సారం చేస్తున్నాయన్నారు. పెన్షన్, ఈపీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని, ఆయాలను, అంగన్‌వాడీ టీచర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. ఆయాలు లింగంపల్లి. సుమలత, లలిత, పుష్ప, భాగ్య, మల్లవ్వ, బాగ్యలక్ష్మి, భూదవ్వ పాల్గొన్నారు.

ఫలితాలపై ఉత్కంఠ..



- మండలి ఎన్నికల్లో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారో..
- జిల్లాలో బెట్టింగ్‌ల జోరు
- నేడు ఎమ్మెల్సీ తుది తీర్పు

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

శాసనమండలి ఎన్నికల్లో తుది ఘట్టం సోమవారం వెల్లడి కానుంది. బ్యాలెట్ బాక్స్‌ల్లో కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ ఎమ్మెల్సీ స్థానాల్లో పోటీ పడ్డ అభ్యర్థులపై పట్టభద్రులు, ఉపాధ్యా యుల తీర్పు నిక్షిప్తమైన ఫలితాలు రానున్నాయి. కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఓట్ల లెక్కింపునకు సర్వంసిద్ధం కాగా రాజన్న సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రులు, ఉపాధ్యాయు లు ఎటువైపు మొగ్గు చూపారనే దానిపై ఆసక్తి నెల కొంది. మండలి పోలింగ్ గత నెల 27న జరిగింది. పోలింగ్‌లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో పట్టభద్రులు 68.73 శాతం, ఉపాధ్యాయులు 94.74శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పట్టభద్రుల్లో జిల్లాలో 22,397 మంది ఓటర్లు ఉండగా 15,394 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో 13,772మంది పురుషుల్లో 9,573 మంది 8,625 మంది మహిళల్లో 5,821మంది ఓటుహక్కు వినియోగించు కున్నారు. ఉపాధ్యాయ ఓటర్లు 950 మంది ఉండగా 900మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. ఇందులో 677 మంది పురుషులకు గాను 643 మంది, 273మంది మహిళలకు గాను 257మంది ఓటు వేశారు. ఓటింగ్ సరళి ముగిసిన నాటి నుంచే రాజన్న సిరిసిల్ల జిల్లా ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారో అనే దానిపై చర్చ కొనసాగుతుంది.

● జిల్లాలో ఎవరికి అధిక ఓట్లు..

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓటర్లు ఎవరికి అధిక ఓట్లు వేశారనే దానిపై చర్చ కొనసాగుతోంది. ప్రధానంగా ఉపాధ్యాయ సంఘాలు, బీసీ సంఘాలు ఉపా ధ్యాయ స్థానంపై దృష్టి పెట్టి అత్యధిక ఓటింగ్ శాతాన్ని పెంచారు. పెరిగిన ఓటింగ్ శాతం ఎవరికి లాభం చేకూరుస్తుందనే చర్చ జరుగుతోంది. పట్టభద్రుల ఓటింగ్‌పై పార్టీ నేతలు, ఉపాధ్యాయ ఓటింగ్ పై సంఘాల ముఖ్య నేతలందరూ నాలుగు రోజులుగా కూడికలు, తీసివేతలతో బిజీబిజీగా ఉన్నారు. మండలస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ఎవరివైపు మొగ్గు చూపారనే దానిపై విశ్లేషణలు చేస్తున్నారు. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ అభ్య ర్థుల మధ్య ప్రధానంగా పోటీ సాగింది. కాంగ్రెస్ అభ్యర్థి జిల్లాలో ప్రలోభాలకు గురిచేశారనే చర్చ కూడా ఉంది. పట్టభద్రులు, ఉపాధ్యాయులు కాని వారు సైతం ఎవరు గెలుస్తారనే దానిపై చర్చలు పెడుతున్నారు.

● పోటాపోటీగా ప్రచారం...

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, అదిలాబాద్ శాసన మండలి పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికల ఫలితాలు సోమవారం వెల్లడి కానున్న నేపథ్యంలో బెట్టింగ్‌ల జోరు కూడా మొదలైంది. ఓటింగ్‌సరళిపై మండలాల వారీగా లెక్కలు తీసిన కొందరు నాయకుల మధ్య పందెలు కాస్తున్నారు. మండలి ఎన్నికల్లో 56 మంది పట్టభద్రుల స్థానంలో, 15 మంది ఉపాధ్యాయ స్థానంలో పోటీ పడ్డారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో బీజేపీ అభ్యర్థి ..

మిగతా8లో

పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలి

- డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి

గంబీరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి) ఉద్యోగ, ఉపాధ్యాయుల అన్ని రకాల పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని డీటీఎఫ్(డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) జిల్లా అధ్యక్షుడు దొంతుల శ్రీహరి డిమాండ్ చేశారు. గంబీరావుపేట కేజీటుపీజీ క్యాంపస్‌లో డీటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన దొంతుల శ్రీహరి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన నాలుగు డీఏలు, పీఆర్సీ, మెడికల్, అర్జిత సెలవుల సరెండర్ బిల్లులు, పదవీ విరమణ పొందిన ఉద్యోగుల బిల్లులు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆర్థిక సంవత్సరం ముగింపునకు వస్తున్నందున ప్రభుత్వం కాలయాపన చేయకుండా వెంటనే బకాయిలు చెల్లించాలన్నారు.

కులగణన సర్వేలో పనిచేసిన ట్రైనర్లకు, ఎన్యుమరేటర్లకు చెల్లించవల్సిన భృతి ఇప్పటికీ చెల్లించలేదని, వారికి అటెండెన్స్ సర్టిఫికెట్స్ జారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో డీటీఎఫ్ మండల అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, మండల ప్రదాన కార్యదర్శి శీలకుమార్, జిల్లా కౌన్సిలర్లు బద్రోద్దిన్, దేవేంద్రం, శ్రీనివాస్‌రెడ్డి, కె శ్రీనివాస్, ఉపాధ్యక్షులు దోసల శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పర్శరాములు, దోసల మధు, చీకట్ల రాజు, లక్ష్మణచారీ, శ్రీకాంత్‌రెడ్డి, ఎర్ర అంజయ్య, పాలోజీ నారాయణ, సతీష్ తిరుపతి, రాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాణీప్రసాద్‌కు వారసత్వ దీప్తుల పురస్కారం ప్రదానం



రాణీప్రసాద్‌కు అవార్డు అందిస్తున్న రాష్ట్ర మాజీ ఎన్నికల అధికారి పార్థసారథి

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ బాల సాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్‌కు వారసత్వ దీప్తుల పురస్కారంతో సత్కరించారు. ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో తెలంగాణ బాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సీతాస్ చారిటబుల్ ట్రస్ట్, అభిజ్ఞ భారత్ అర్గనైజేషన్, అక్షరయాన్ సంయుక్తంగా రెండు రోజుల పాటు జాతీయ సాహిత్య సదస్సు నిర్వహించారు. ఇందులో రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బాల సాహితీవేత్త డాక్టర్ కందేపీ రాణీప్రసాద్ తన తల్లిగారైన రచయిత్రి అంగలకుదిటి గోవిందమ్మ సాహిత్యంపై సదస్సులో పత్ర సమర్పణ చేశారు. ఈ సందర్భంగా వారసత్వ రచయిత్రులకు అందించే పురస్కారాన్ని రాణీప్రసాద్‌కు మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి పార్థసారధితో పాటు ప్రముఖ సాహితీవేత్తలు పురస్కారాన్ని అందించి సన్మానించారు. పురస్కారాన్ని అందుకున్న రాణీప్రసాద్‌ను మానేరు రచయితల సంఘం, జిల్లా రచయితల సంఘం, సిరిసిల్ల సాహితీ సమితి, కవులు, రచయితలు అభినందించారు.

అంతర్జాతీయ హెచ్ఆర్‌సీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

ముస్తాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మానవ హక్కుల కమిషన్ రాజన్న సిరిసిల్లా జిల్లా అధ్యక్షుడు ఎండీ జహంగీర్‌ను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మట్ట వెంకటేశ్వర్‌రెడ్డి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జెల్ల వెంకటస్వామి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం యూత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం స్వామి, కేటీఆర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మెంగని మనోహర్, యెల్ల రాంరెడ్డి, దమ్మ రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. ముస్తాబాద్‌కు చెందిన జహంగీర్ జిల్లా అధ్యక్షుడుగా నియామకంపై అభినందించి సత్కరించారు.

రైతులపై కేటీఆర్ మొసలి కన్నీరు

- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఏదో శుభకార్యానికి వచ్చి కేటీఆర్ రైతులతో మాట్లాడి మొసలి కన్నీరు కారుస్తు న్నారని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిపేట మండలంలో పంటల పరిశీలన పేరుతో కేటీఆర్ మాట్లాడిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. విలేకరులతో మాట్లాడుతూ కేటీఆర్ సిరిసిల్లకు అమావాస్య పున్నానికి వస్తూ ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన మాటలు చూస్తే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని అన్నారు. పడావు పడ్డ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, మల్కపేట ప్రాజెక్ట్ నుంచి సిరిసిల్ల నియోజకవర్గంలో ఎల్లారెడ్డిపేటకు 0.2 టీఎంసీల నీళ్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిందని అన్నారు. కాళేశ్వరం ఉండి ఉంటే కేసీఆర్ నీళ్ల వదిలిపెడితే దేవునిగుట్ట వరకు నీళ్ల పోతాయని కేటీఆర్ మాట్లాడిన మాట శుద్ధ అబద్ధమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో మల్కపేట రిజర్వాయర్ నుంచి చుక్కనీరు దేవునిగుట్ట వరకు కాదు కిందివరకు కూడా విడుదల చేయ లేదన్నారు. మల్కపేట రిజర్వాయర్ పనులు చేసిన వారికి రూ. 11 కోట్లు బకాయి పెడితే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేసిందని తెలిపారు. చిరువ్యాపారులకు తాము వ్యతిరేకం కాదని టీస్టాల్ విషయం లో కేటీఆర్ బొమ్మ ఉంటే ఎన్నికల కోడ్ సమయంలో మీరు తప్పు అనాల్సింది పోయి దానిని కూడా రాజకీయం చేస్తున్నార ని ఎన్నికల కోడ్‌లో మహనీయుల విగ్రహాలకే ముసుగు వేస్తున్నారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండువేల ఎకరాల ప్రభుత్వ భూములు దోచిపెడితే కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి ప్రభుత్వ ఖజానాకు జమచేసిందని తెలిపారు. పట్టణంలో నేను దోచుకుంటా పల్లెల్లో మీరు దోచుకోండి అన్న చందాన కేటీఆర్ మాట్లాడిన తీరు ఉందని అన్నారు. కేసీఆర్ అంటే మీరు కాళేశ్వరం అంటున్నారు. అది కూళేశ్వర్‌రావు అయిందన్నారు. మీరే కాళేశ్వరం పర్రె పడిందని ఒప్పుకున్నారన్నారు. కాళేశ్వరంలో నీటిని అపితే డ్యాం కూలిపోతుందని అధికారులు చెప్పారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో కాళేశ్వరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని విమర్శించారు. కాళేశ్వరం చుక్కనీరు వాడకుండా గతంలో కాంగ్రెస్ కట్టిన ప్రాజెక్ట్‌లతో వానాకా లంలో రైతులు వడ్లు పండించారని అన్నారు. ఎగువ మానేరుకు అర టీఎంసీ నీటిని విడుదల చేశామని తెలిపారు. 25 లక్షల రైతు కుటుంబాలకు ఏకకాలంలో రుణమాఫీ చేశామని అన్నారు.



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సాగు నీరందించేందుకు ప్రభుత్వం సిద్ధం

- కేకే మహేందర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం మల్కపేట జలాశయం నుంచి 9 ప్యాకేజీ కాల్వ ద్వారా ఎగువ ప్రాంత రైతులకు సాగు నీరందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజక వర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటోందన్నారు. రాజకీయ ఉనికి కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపుతున్నారని ధ్వజమెత్తారు. పదేళ్ల అధికారంలో ఉండి 9వ ప్యాకేజీ కాల్వను ఎందుకు పట్టించుకోలేదో..? రైతులకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పంట పొలాలకు సాగు నీరు అందించడంతో పాటు ప్రతి రైతును ఆదుకునేందుకు కాంగ్రెస్ సర్కారు సిద్ధంగా ఉందని కేకే మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలి

కోనరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉత్తరప్రదేశ్ మాధూరు జిల్లాలో పర్యటిస్తున్న భీమ్ ఆర్మీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్ కుమార్ కోరారు. ఈ సందర్భంగా సుద్దాలలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఉత్తర రాష్ట్రాల్లో కుల వివక్ష, అణిచివేతకు, అంటరానితనానికి వ్యతిరేకంగా ప్రభుత్వాలను ప్రశ్నిస్తున్న చంద్రశేఖర్ ఆజాద్‌ను ఎదుర్కొనలేక కొంతమంది గూండాలు అతనిపై దాడికి సిద్ధపడుతున్నారని అన్నారు. కొన్ని సంవత్సరాలుగా దళిత గిరిజనుల, మైనార్టీ పక్షాన ఉద్యమిస్తున్న తీరు, ప్రజల నుంచి వస్తున్న ఆదరణను చూడలేక అక్కడి యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం భౌతిక దాడులు చేస్తోందని తెలిపారు. గతంలో కూడా ఆజాద్‌పై దుండగులు కాల్పులు జరిపినా ఇంత వరకు వారిని పట్టుకోలేదన్నారు. చంద్రశేఖర్ ఆజాద్‌కు భద్రత కల్పించడంలో విఫలమైందన్నారు. ప్రశ్నించే గొంతులు లేకుండా దళిత, మైనార్టీ నాయకులను టార్గెట్ చేసి వారిని అంతం చేయాలని యోగి ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆరోపించారు. వెంటనే ముఖ్యమంత్రి యోగి స్పందించి దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వంశీ, సాయి కుమార్, శ్రీకాంత్, అర్జున్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా - ప్రభుత్వ ప్రధాన వైద్యశాల ఆకస్మిక తనిఖీ





ఆసుపత్రిలో రోగితో మాట్లాడుతున్న కలెక్టర్, బియ్యం నిల్వను పరిశీలిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

సిరిసిల్ల టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వైద్యులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రభుత్వ ప్రధాన వైద్యశాలను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోస్టర్‌లో ఎంత మంది వైద్యులు విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు. ఆసుపత్రిలో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా అని ఆసుపత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రతీ వార్డులో ప్రస్తుతం ఎంత మంది పేషెంట్లు ఉన్నారు.. వారికి ఏ విధంగా వైద్య సేవలు అందిస్తున్నారు వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఆసుపత్రిలో లివర్ సమస్యతో బాధపడుతున్న ఓ రోగి కుటుంబసభ్యులు ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్న మెరుగుపడడం లేదంటూ కలెక్టర్ దృష్టికి తీసుకురావడంతో స్పందించిన కలెక్టర్ రోగి ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకొని అవసరమైతే మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు పంపించాలని వైద్యులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, జనరల్, ప్రసూతి, ఆర్థో, పిడియాట్రిక్, సర్జికల్ వార్డులతో పాటు ఇతర విభాగాలను పరిశీలించారు. రోగులను అందిస్తున్న వైద్య సేవల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యాలతో రోగులు సుదూర ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఆసుపత్రులపై నమ్మకంతో వస్తారని వారికి అన్ని రకాలుగా భరోసా కల్పిస్తూ మెరుగైన వైద్యం అందించడం వైద్యులు, సిబ్బంది కర్తవ్యమని అన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

ఎల్లారెడ్డిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని కలెక్టర్ సందీప్‌కుమార్‌ఝా ఆదేశించారు. ఎల్లారెడ్డిపేట మండలం దుమాలలోని ఏకలవ్య మోడల్ రెసిరెన్షియల్ విద్యాలయాన్ని ఆదివారం ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంట గదులు, భోజన శాల, మూత్రశాలలు, వంట సామగ్రిని పరిశీలించారు. పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చిమొక్కలు లేకుండా శుభ్రం చేయాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు.

నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి చాక్ పీసు పట్టుకుని లెక్కలు బోధించారు. గణితంలోని విద్యార్థుల ప్రగతిపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల బోధన, భోజనం ఏలా ఉంటుందని ప్రశ్నించారు. విద్యార్థులకు పాఠాలు బోధించారు. వివిధ అంశాలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని అన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు.

సాగునీటి కోసం అన్నదాతలతో కలిసి పోరాటం

- రైతులను గోస పెట్టవద్దు - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ - దేవునిగుట్ట తండాలో ఎండిన పంటల పరిశీలన





దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన పంటను పరిశీలిస్తున్న కేటీఆర్, పోతుగల్‌లో రైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల/ఎల్లారెడ్డిపేట మార్చి 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకోని రైతులను కాపాడుకోవడా నికి నీళ్ల విడుదల చేయాలని, నీళ్ల విడుదల చేయ కుంటే అన్నదాతలతో కలిపి పోరాటాన్ని ఉధృతం చేస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. సిరిసిల్ల జిల్లాలో వందల ఎకరాల్లో పంట లు ఎండిపోతున్నాయని చూస్తూ ఊరుకోబోమని, 48 గంటల్లో నీళ్లను వదిలిపెట్టకపోతే మంత్రి చాంబర్ ఎదుట ధర్నా చేస్తామని కేటీఆర్ అన్నారు. ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లాలోని తంగళ్లపల్లి, సిరిసిల్ల, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్‌లలో పర్యటించా రు. ఎల్లారెడ్డిపేట మండలం దేవునిగుట్ట తండాలో ఎండిపోయిన పంటలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. సాగునీరు లేక ఇబ్బందులు పడుతున్న తీరును రైతులు కేటీఆర్‌కు వివరించారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ కాళేశ్వరం నుంచి నీళ్ల తీసుకువచ్చి మల్కపేట రిజర్వాయర్‌లో పోస్తే దేవునిగుట్ట తండాలోని రైతులు వ్యవసాయం చేసేవారని అన్నారు. సిరిసిల్ల ప్రాంతంలో చాలా మంది రైతులు సాగు నీరులేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ప్రస్తుతం మిడ్ మానేరులో 16 టీఎంసీల నీళ్ల ఉన్నాయని ఒక టీఎంసీ నీళ్లను మల్కపేట రిజర్వాయర్‌కు వదిలిపెట్టాలని కోరుతున్నామని అన్నారు. కేసీఆర్ అంటే కాళేశ్వరం... కాంగ్రెస్ అంటే శనీశ్వరం ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అన్నారు. కేసీఆర్ మీద ఉన్న కోపం, ద్వేషంతో మేడిగడ్డలో జరిగిన కుట్రపూరిత ప్రమాదాన్ని సాకుగాచూపడంతో రాష్ట్రవ్యాప్తంగా పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించారు. బీఆర్ ఎస్ పాలనలో మండు వేసవిలో కూడా సిరిసిల్ల జిల్లాలో ని ఎగువ మానేరు మత్తడి దూకిందని అన్నారు. ఇప్పటికే 450 మంది రైతులను రేవంత్‌రెడ్డి పొట్టన పెట్టుకున్నాడని అన్నారు. కాంగ్రెస్‌చెప్పిన రైతు డిక్లరేషన్‌లో ఒక మాట కూడా నిలబెట్టుకోలేదని రైతు బంధును కూడా వేయడం లేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం బుద్ధి తెచ్చుకొని రైతులు కాపాడుకోవడానికి వెంటనే నీళ్ల విడుదల చేయాలని అన్నారు.

రైతులకు అండగా బీఆర్ఎస్...

ముస్తాబాద్: రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని రైతులు ఎవరు అధైర్య చెందొద్దని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె తారకరామారావు పేర్కొన్నారు. మండలంలోని పోతుగల్ గ్రామంలో జెల్ల దేవయ్య అనే రైతు పంటలు ఎండిపోతున్నాయని కలత చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకోగా కేటీఆర్ వారి ఇంటికి వెళ్లి కుటుంబాన్ని ఓదార్చారు. పార్టీ తరుపున రూ 2 లక్షల ఆర్థికసాయాన్ని అందించారు. రైతుల కోసం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు భీమా త్వరలోనే అందుతుందన్నారు. వెంకట్రావుపల్లె గ్రామానికి చెందిన అగ్రారం విష్ణు అనే పోలీస్ కానిస్టేబుల్ బాత్‌రూంలో జారి గుండెపోటుతో మరణించగా ఇంటికి వెళ్లి కేటీఆర్ పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా పోతుగల్, గన్నెవానిపల్లె, సేవాలాల్‌తండా, వెంకట్రావుపల్లెలో పంటలు ఎండిపోతున్నాయని పలువురు రైతులు కేటీఆర్‌కు ఏకరువు పెట్టారు. భూగర్భ జలాలలు అడుగంటి పోయాయని ధర్నా చేస్తే వారం రోజులు నీళ్ల విడిచి మళ్లీ బందు చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా కార్యక్రమాల్లో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, బీఆర్ ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు తన్నీరు బాపురావు, గుండారపు కృష్ణరెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్‌రావు, డాక్టర్ చంద్రశేఖర్‌రావు, మాజీ ఎంపీపీ జనగామ శరత్ రావు, మాజీ జడ్పీటీసీ లక్ష్మణ్‌రావు, తన్నీరు గౌతంరావు, ఎద్దండి నర్సింహరెడ్డి, సర్వర్ పాషా, యాది మల్లేశ్, అన్వర్, చందురావు, సంతోష్‌రావు, నవాజ్ పాల్గొన్నారు.

● జూన్ కల్లా ఎన్నికలు ..సిద్ధంగా ఉండండి

వచ్చే జూన్ కల్లా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉందని కార్యకర్తలు గ్రామాల్లో సిద్ధంగా ఉండాలని కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మంచి పనులు, అభివృద్ధిని వివరిస్తూ ప్రస్తుత కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

శుభకార్యానికి వెళ్తూ.. అనంత లోకాలకు

● బస్సు ఢీకొని భర్త మృతి, భార్యకు తీవ్ర గాయాలు



నర్సారెడ్డి (ఫైల్)

మెట్‌పల్లి టౌన్/రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై శుభ కార్యానికి వెళ్తుండగా ఆదివారం మెట్‌పల్లి మండలం వేంపేట గ్రామ శివారులో ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో జవుడి నర్సారెడ్డి(65) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందగా అతడి భార్య అనసూయకు తీవ్ర గాయాలయ్యాయి. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం కోరుట్ల మండలం ఎకీన్‌పూర్ గ్రామానికి చెందిన నర్సారెడ్డి, భార్య అనసూయతో కలిసి ద్విచక్ర వాహనంపై మల్లాపూర్ మండలం వేంపల్లి గ్రామంలోని బంధువుల శుభకార్యానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. ఈక్రమంలో అతి వేగంగా వస్తున్న మెట్‌పల్లి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. అనంతరం నర్సారెడ్డి తలపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందగా అనసూయ తీవ్ర గాయాలయ్యాయి. బస్సు డ్రైవర్ రాకేష్ ప్రమాదం జరిగిన వెంటనే అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం అందించి అనసూయను మెట్‌పల్లి ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించి పోస్టుమార్టం కోసం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నర్సారెడ్డికి ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. ప్రమాదానికి కారకుడైన బస్సు డ్రైవర్ రాకేష్‌పై చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

●ఎఖీన్‌పూర్‌లో విషాదం

కోరుట్ల రూరల్: రోడ్డు ప్రమాదంలో జవుడి నర్సారెడ్డి మృతితో ఎకీన్‌పూర్‌లో విషాదం నెలకొంది. నర్సారెడ్డి గతంలో టీడీపీలో క్రియాశీలకంగా పనిచేసి అనంతరం బీఆర్ఎస్ పార్టీలో పని చేశాడు. ఎకీన్‌పూర్‌లో నర్సారెడ్డి మృతదేహానికి కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ నివాళులర్పించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య



సదయ్య(ఫైల్)

ఓదెల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలనూర్ శివారులో సుల్తానాబాద్ మండలం అల్లిపురం గ్రామానికి చెందిన సిరికొండ సదయ్య (43) అనే వ్యక్తి ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య రాజమణి పొత్కపల్లి ఎస్సైకి ఇచ్చిన ఫిర్యాదుమేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సదయ్య ఐదేళ్లక్రితం రూ.10లక్షలు అప్పు చేసి సెకండ్ హ్యాండ్ హార్వెస్టర్ కొనుగోలు చేశాడు. అప్పటి నుండి సక్రమంగా గిరాకీ లేకపోవడం, వాహనం తరచూ రిపేర్‌కువచ్చింది. దీంతో చేసిన అప్పులుతీర్చే పరిస్థితి లేకుండాపోయింది. జీవితంపై విరక్తిచెంది కొలనూర్ శివారులో గడ్డిమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడని అతని భార్య సిరికొండ రాజమణి తెలిపింది. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పొత్కపల్లి ఎస్సై రమేష్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

జగిత్యాలరూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ స్టేషన్ పరిధిలోని టీఆర్‌నగర్ గ్రామానికి చెందిన షేక్ రఫే (28) అనే యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ఆటో నడిపే షేక్‌రఫే శనివారం సాయంత్రం బయటికివెళ్లి అదృశ్యమయ్యాడు. బంధువులు వెతగ్గా టీఆర్‌నగర్ గ్రామంలోని శ్మశానవాటిక వద్ద అనుమానాస్పదస్థితిలో మృతిచెంది ఉన్నాడు. మృతుడి తండ్రి షేక్ రజాక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సధాకర్ తెలిపారు.

మహిళపై హత్యాయత్నం

రామడుగు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని వన్నారం అనుబంధ గ్రామమైనసుద్దాలపల్లిలో ఓమహిళపై యువకుడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూట రాజ్‌కుమార్ అదే గ్రామానికి చెందిన ఓ యువతికి ప్రేమపేరిట సెల్‌ఫోన్‌కు మెస్‌జ్‌లు పంపుతున్నాడు. ఇది గమనించిన తల్లి ఆమె కూతురికి కుటుంబ పరిస్థితిని వివరించి మంచి చెప్పింది. అనంతరం సదరు యువతికి తల్లి పెళ్లి చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈ క్రమంలో విషయం తెలుసుకున్న రాజ్‌కుమార్ సదరు యువతి ఇంటికి వచ్చి యువతి తల్లిపై దాడికిదిగాడు. గమనించిన గ్రామస్థులు రాజ్ కుమార్‌ను అడ్డుకోవడంతో ఆమె ప్రాణాలతో బయటపడింది. ఈ ఘటనపై యువతి పోలీసులకు ఫిర్యాదుచేయగా ఎస్సై శేఖర్ కేసు నమోదుచేసి రాజ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

రామడుగు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని రంగసాయిపల్లి గ్రామానికిచెందిన ఓమహిళ అదృశ్యంపై కేసునమోదు చేసినట్లు ఎస్సైశేఖర్ తెలిపారు. పోలీసులు తెలిపినవివరాలప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దినవ్వ కుటుంబ కలహాల నేపథ్యంలో గతనెల 28న ఇంటినుంచి మధ్యాహ్నం సమయంలో వెళ్లిపోయింది. ఆదివారం సదరు మహిళ తల్లి విమల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదకరంగా గన్నేరువరం చెరువుకట్ట రోడ్డు

- రాత్రివేళ ప్రయాణం ప్రాణాలతో చెలగాటమే
- దారంతా చీకటి, ఇరుకైన రోడ్డు
- గుంతలతో పొంచి ఉన్న ప్రమాదం



గన్నేరువరం చెరువు కట్ట రోడ్డు

గన్నేరువరం, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని చెరువు కట్ట రోడ్డు ఇరుకుగా, గుంతలు పడి ప్రమాదకరంగా మారింది. మండల కేంద్రం నుంచి ఈ చెరువుకట్టను దాటితేనే పొత్తూరు మీదుగా కరీంనగర్‌కు చేరుకోవచ్చు. నిత్యం ఈ దారి గుండా బస్సులు, ప్రైవేట్ వాహనాలు, ద్విచక్ర వాహనదారులు అధికసంఖ్యలో కరీం నగర్‌కు వెళుతుంటారు. చెరువుకట్టకు ఒక పక్క చెరువులోని నీరు, మరో పక్క లోతుగా ఉన్న పంటపొలాలు, అక్కడక్కడా వ్యవసాయ బావులు కట్టను ఆనుకొని ఉన్నాయి. ఈ చెరువు కట్టమీది నుంచి బస్సు వెళుతుంటే ఎదురుగా మరో వాహనం వెళ్లడానికి వీలు ఉండదు. దారి ఇరుకుగా ఉండడంతో బస్సు వెళ్లేదాకా ఆగాల్సిన పరిస్థితి. కట్టపైన ఉన్న విద్యుత్ స్థంబాలకు విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో రాత్రిళ్లు కట్టపై ప్రయాణం చేసే వాహనదారులు ప్రాణాలను అర చేతిలో పెట్టుకుని ప్రయాణిం చాల్సిన పరిస్థితి నెలకొంది. కట్టపైన రోడ్డుకు రెండు పక్కలా ఎలాంటి రక్షణ లేకుండా విద్యుత్‌స్థంబాలకు అతికించిన రేడియం స్టిక్కర్లనే ప్రమాద సూచికలుగా భావిస్తూ వాహనదారులు ముందుకు వెళుతున్నారు. అంతే కాకుండా రోడ్డు సైతం అక్కడక్కడా కుంగి గుంతలు పడి ప్రమాదకరంగా మారడంతో ఆదమరచి ప్రయాణిస్తే ప్రమాదాల బారిన పడాల్సిందే. ఈ కట్టపై గతంలో ట్రాక్టర్లు అదుపుతప్పి కట్ట కిందకు దూసుకెళ్లి ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. గుండ్లపల్లి నుంచి గన్నేరువరం మీదుగా పొత్తూరు వరకు డబుల్ రోడ్డు మంజూరు కాగా రోడ్డుపనులు గుండ్లపల్లి నుంచి జంగపల్లి వరకు మాత్రమే సాగుతున్నాయి. అధికారులు చెరువుకట్ట వద్ద ముందుగా రోడ్డు వెడెల్పు పనులను ప్రారంభించి, కట్టపైన విద్యుత్‌దీపాలను అమర్చి ప్రమాదాలు జరుగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



కట్టపై చీకట్లో ప్రయాణం చేసేవారికి ప్రమాద సూచికలుగా విద్యుత్ స్తంభాలకు వేసిన రేడియం స్టిక్కర్లు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మంథని రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని అడవి సోమన్‌పల్లి వద్ద ఆదివారం రాత్రి ఆగిఉన్న లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఒకరికి తీవ్రగాయాలు అయ్యాయి. భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలం నర్సింగాపూర్ గ్రామానికి చెందిన సుగుణాకర్ మంథని మండలంలోని అరెండ గ్రామానికి కారులోవచ్చి తిరిగి వెళుతున్నాడు. ఈ క్రమంలో అడవిసోమన్‌పల్లి వద్ద లారీని కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుగుణాకర్ తలకు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అతన్ని ఇతర ప్రయాణికులు చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు తరలించారు.

తుమ్మనపల్లిలో రెండు కార్లు ఢీ

హుజూరాబాద్‌రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం రెండు కార్లు ఢీకొన్నాయి. ఈఘటనలో కార్లు ధ్వంసంకాగా, తృటిలో ప్రాణా పాయం తప్పింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీం నగర్ నుంచి వస్తున్న ఓ కారు తుమ్మనపల్లి గ్రామంలోకి వె ళ్లేందుకు కుడివైపు తిరుగుతున్న క్రమంలో హుజూరాబాద్ నుంచి కరీంనగర్ వైపువెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈఘటనలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతాఊపిరి పీల్చుకున్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మెట్‌పల్లిటౌన్/రూరల్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలం సాతారం గ్రామం నుంచి అక్రమంగా మెట్‌పల్లికి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టణ శివారులోని వెంపేట రోడ్డులో పట్టుకున్నట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. అనుమతిలేకుండా మెట్‌పల్లికి ఇసుకట్రాక్టర్ రావడంతో రెవెన్యూ, పోలీస్‌సిబ్బంది పట్టుకొని పోలీస్ స్టేషన్ తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ డ్రైవర్ రాంబాబు, ట్రాక్టర్ యాజమాని రోహిత్‌పై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు.



పోలీసులు పట్టుకున్న ఇసుక ట్రాక్టర్

శిథిలావస్థలో పశు వైద్యశాల

● ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి ● పట్టించుకోని ప్రభుత్వం

కళ్యాణ్‌నగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని పశువైద్యశాల ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. 1988లో అప్పటి పశువైద్యశాఖ మంత్రి సత్యనారాయణ, జీడ్స్ చైర్మన్ సుద్దాల దేవయ్య ఈ వైద్యశాలను ప్రారంభించారు. ఇక్కడ పశువైద్య డైరెక్టర్ పోస్టును కూడా మంజూరు చేశారు. డైరెక్టర్ స్థాయి అధికారి ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. మూడున్నర దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ వైద్యశాల ఎప్పుడు కూలిపోతుందోనని వైద్యులు, వైద్యసిబ్బంది బిక్కుబిక్కున కాలం వెళ్లదీస్తున్నారు. రామగుండం నోటిఫైడ్ ఏరియాగా ఉన్నప్పుడు పశు వైద్యశాలను ఏర్పాటు చేశారు. చుట్టుపక్కల గ్రామాలైన జనగామ సుందిళ్ల, అడ్డగుంటపల్లి, ఎల్కలపల్లి, లక్ష్మీపురం, పెంచికలపేట, ఖాజిపల్లి, పోరట్‌పల్లి, భీమునిపట్నంతో పాటు 40గ్రామాల నుంచి రైతులు ఆవులు, గేదెలు, మేకలు, కోళ్లను వైద్యం కోసం తీసుకువచ్చేవారు. ఆయా గ్రామాల్లో ఇప్పుడు పశువైద్యశాలలు ఏర్పాటు చేయడంతో ప్రధాన ఆసుపత్రి అయిన ఈ పశువైద్యశాలపై నిర్లక్ష్యంతో కూలిపోయే దశకు చేరుకుంది. పశువుల కట్టేందుకు ఏర్పాటు చేసిన పరికరం కూలిపోయే దశకు చేరుకుంది. ఈ ఆసుపత్రిని ఎలాంటి అభివృద్ధిని చేయడం లేదు. తలుపులు, కిటికీలు చెదలు పట్టి ఊడిపోయే పరిస్థితి నెలకొన్నది.



శిథిలమైన భవనంలో కొనసాగుతున్న గోదావరిఖని పశు వైద్యశాల

వైద్య సిబ్బందికి కనీస సౌకర్యాలు కరువు..

ఖని పశువైద్యశాలలో అసిస్టెంట్ డైరెక్టర్‌తో పాటు ఇద్దరు వైద్యులు, నర్సులు ఉన్నా వారికి కనీస సౌకర్యాలు కరువయ్యాయి. ఎప్పుడో నిర్మించిన పాత భవనంలోనే విధులను నెట్టుకొస్తున్నారు. వారు కూర్చోవడానికి సరైన కుర్చీలు, తాగునీటి సౌకర్యం కూడా లేదు. వైద్యం కోసం వచ్చే వారికి కూర్చోవడానికి సౌకర్యం లేకపోవడంతో ఎండలోనే వేచి చూడాల్సి పరిస్థితి ఉంది.



నాలాలోకి వంగిన పశువులను కట్టేసే పరికరం

40గ్రామాలకు ఏకైక ఆసుపత్రి..

మేకల సమ్మయ్య



జనగామ, అడ్డగుంట గ్రామాలు ఉన్నప్పుడు గోదావరిఖనిలో ఏకైక పశు వైద్యశాల. ఇక్కడికి 40గ్రామాల నుంచి రైతులు పశువులను తీసుకువచ్చే వారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ ఆసుపత్రి ఇప్పుడు శిథిలావస్థకు చేరుకుంది. ఇక్కడికి చాలా మంది పశువులను, కుక్కలను తీసుకువచ్చి వైద్యం చేయిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా వైద్య శాల మరమ్మతుకు, నూతన భవన నిర్మాణానికి నోచుకోవడం లేదు. ఇప్పటికైనా నూతన భవనం నిర్మించాలి.

నిర్మాణం కూల్చివేసిన వారిపై కేసు నమోదు

రామడుగు, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాముపల్లి గ్రామంలో ఇంటి నిర్మాణాన్ని కూల్చివేసిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఉట్కూరి అనిల్‌రెడ్డి శనివారం తను కొనుగోలు చేసిన భూమిలో ఇల్లు నిర్మిస్తున్న క్రమంలో అను పురం పరశురాములు, అనుపురం మహేష్, శ్రీనివాస్ అక్రమంగా చొరబడి ఇంటి గోడలు, రేకులను కూల్చివేశారు. ఈ ఘటనపై బాధి తుడు ఉట్కూరి అనిల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

తన భర్త మరణానికి కారకులంటూ ఫిర్యాదు

చొప్పదండి, మార్చి 2(ఆంధ్రజ్యోతి): దుకాణం షటర్ల విషయంలో తన భర్తను మోసం చేసి మరణానికి కారకులయ్యారని చొప్పదండికి చెందిన కట్ల శ్రీలత ఎస్సై అనూషకు ఫిర్యాదు చేసింది. తనభర్త కట్ల రమేష్(45) 2017లో గౌడలచ్చయ్య, గౌడరమేష్ వద్ద చొప్పదండిలోని మూడు షటర్లను కొనుగోలు చేసేందుకు 48లక్షల రూపాయలను బయానాగా ఇచ్చాడన్నారు. 7సంవత్సరాలు దాటినా ఆస్తిని రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో తనభర్త కట్ల రమేష్ మనస్థానం చెంది అనారోగ్యంతో మరణించాడని తెలిపారు. తన మరణానికి గౌడ లచ్చయ్య, గౌడ రమేష్ కారణమని కట్ల రమేష్ లేఖ రాశాడని, భార్య శ్రీలత ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి కార్మికుడి దుర్మరణం

జ్యోతినగర్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ లేబర్‌గేటు సమీపం లో రాజీవ్‌రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నూనె సాగర్(30) అనే సింగరేణి కార్మికుడు మృతిచెందాడు. రామగుండం నుంచి గోదావరిఖని వైపువెళ్తున్న క్రమంలో గుర్తు తెలియని లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. తీవ్రంగా గాయపడిన సాగర్‌ను ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సాగర్ మృతి చెందాడు. సాగర్ సింగరేణి ఆర్‌జీ 1, 2వ ఇంక్లయిన్ గనిలో మైనింగ్ సర్దార్‌గా పని చేస్తున్నాడు. ఎన్టీపీసీ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనులు పూర్తి అయ్యేదెప్పుడో..!



కంకర తేలి ప్రమాదకరంగా మారిన రహదారి

మల్యాల, మార్చి 2(ఆంధ్రజ్యోతి): మల్యాల-పెగడపల్లి మండల కేంద్రాలను కలిపే రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్లుగా డబుల్‌రోడ్డు పనులు జరుగుతుండడంతో రహదారికి ఇరువైపులా కంకర తేలి అధ్వాన్నంగా మారింది. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే వాహనాలు, ద్విచక్రవాహనాల రాకపోకలకు తీవ్రఅసౌకర్యంగా మారగా ప్రయాణీకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. రెండేళ్ల క్రితం ప్రారంభం అయిన ఈ పనులను త్వరితగతిన పూర్తిచేస్తే రెండు మండలాల ప్రజలకే కాకుండా ఇతర ప్రాంతాల వారికి సౌకర్యంగా మారనుంది.

తిప్పాపూర్‌లో అస్తవ్యస్తంగా పారిశుధ్యం

- డ్రైనేజీ లేక కాలనీవాసుల ఇబ్బందులు - రోడ్డుపక్కన పేరుకుపోయిన చెత్తకుప్పలు - కాలనీలో చెత్తబుట్టలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి



తిప్పాపూర్‌లో డ్రైనేజీ లేక ఇళ్ల ముందు పేరుకుపోయిన మురుగు నీరు



ఇళ్ల మధ్యలో సాయిబాబా ఆలయం ఎదుట చెత్తకుప్పలు

వేములవాడ టౌన్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ గ్రామంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో ఎక్కడ చూసిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. పారిశుధ్యంపై పట్టింపు లేనట్టుగా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు ప్రాతినిధ్యం వహించినప్పుడు పరిస్థితి అలాగే ఉన్నా ప్రస్తుతం స్పెషల్ అధికారుల పాలనలో కూడా మున్సిపల్ అధికారులు పట్టించుకోకపోవడంతో సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి.

● రోడ్ల పక్కనే చెత్త కుప్పలు..

తిప్పాపూర్ హనుమాన్ దేవాలయం వెనుక భాగంలో స్కూల్‌కు వెళ్లే రోడ్డులో సాయిబాబా ఆలయం ముందు రోడ్డు పక్కన కుప్పలుకుప్పలుగా చెత్తను పడేస్తున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. నిత్యం సాయిబాబా ఆలయానికి వచ్చే భక్తులకు చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని సంబంధిత ఇంటి యజమానులకు ఆరుబయట చెత్త వేయకుండా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాలనీలో ఎక్కువ చెత్తను పడవేసే చోట చెత్తబుట్టలను ఏర్పాటు చేస్తే అందులో వేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. చెత్త పేరుకుపోవడంతో స్థానిక కాలనీ వాసులు అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిప్పాపూర్ ప్రభుత్వ స్కూల్ నుంచి మూలవాగులోకి వెళ్లే మార్గంలో కుడివైపున ఇళ్లలో నుంచి వచ్చే వ్యర్థపు నీరు రోడ్డుపై పారుతోంది. నీరు నిల్వ ఉండటంతో పందులకు ఆవాసంగా మారి స్థానికులు అనారోగ్యం బారిన పడుతున్నారు. డ్రైనేజీ నిర్మించాలని మున్సిపల్ అధికారులను స్థానికులు కోరుతున్నారు.

ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధం

- ఉదయం 8 గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం
- 800 మందితో ఓట్ల లెక్కింపు
- రెండు, మూడు రోజుల పాటు కొనసాగే అవకాశం



కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో కౌంటింగ్ కోసం చేసిన ఏర్పాట్లు

కరీంనగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓట్లను లెక్కింపునకు అధికారులు ఏర్పాటు పూర్తి చేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియం ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రారంభం కానుంది. పట్టభద్రుల నియోజకవర్గంలో 2,50,328 మంది ఓటర్లు, ఉపాధ్యాయ నియోజకవర్గంలో 24,968 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పట్టభద్రుల నియోజకవర్గంలో 56 మంది అభ్యర్థులు, ఉపాధ్యాయ స్థానంలో 15 మంది పోటీచేశారు. నియోజకవర్గ పరిధిలోని 773 పోలింగ్ కేంద్రాల ఓట్లను మూడు షిఫ్టుల్లో 35 టేబుళ్లపై పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఓట్లను వేర్వేరుగా లెక్కించేందుకు ఏర్పాట్లు చేశారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపునకు 21 టేబుళ్లు, ఉపాధ్యాయుల ఓట్ల లెక్కింపునకు 14 టేబుళ్లు సిద్ధం చేశారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిచేసేందుకు 800 మంది ఉద్యోగులను నియమించి వారికి శిక్షణ ఇచ్చారు. ప్రతి టేబుల్ వద్ద ఒక మైక్రో అబ్జర్వర్, సూపర్‌వైజర్, ఇద్దరు కౌంటింగ్ అసిస్టెంట్లు విధులు నిర్వహించనున్నారు. ప్రాధాన్య క్రమంలో చేపడుతున్న ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి రెండు, మూడు రోజులు పట్టే అవకాశమున్నందున మూడు షిఫ్టుల్లో ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు సిబ్బందిని నియమించారు. ఓట్ల లెక్కింపు చేసే హాళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు.

● అర్ధరాత్రి వరకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఫలితాలు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో 15 మంది అభ్యర్థులు మాత్రమే పోటీపడుతుండటమే కాకుండా 24,968 ఓట్లు మాత్రమే లెక్కించాల్సి ఉండడంతో సోమవారం అర్ధరాత్రి వరకు ఈ ఫలితాలు వెల్లడయ్యే అవకాశాలుంటాయని భావిస్తున్నారు. ఆదివారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులు, సిబ్బందికి ఓట్ల లెక్కింపుపై అవగాహన కల్పించారు.

● రెండో ప్రాధాన్య ఓట్లే కీలకం

పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో కాంగ్రెస్ అభ్యర్థి వి నరేందర్ రెడ్డి, బీజేపీ నుంచి సి అంజిరెడ్డి, బీఎస్పీ అభ్యర్థిగా ప్రసన్న హరికృష్ణ, ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ అభ్యర్థిగా సర్దార్ రవీం దర్‌సింగ్‌సహా 56 మంది అభ్యర్థులు పోటీ చేశారు. తొలి ప్రాధాన్యత ఓటుతో అభ్యర్థి విజయం సాధించాలంటే పోలైన ఓట్లలో చెల్లిన ఓట్లలో 50 శాతానికంటే ఒక ఓటు అధికంగా రావలసి ఉంటుంది. ఏకపక్షంగా పోలింగ్ జరగక పోవడం, ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్కరికి ఓట్లు ఎక్కువగా పోల్‌కా వడంతో తొలి ప్రాధాన్య ఓటుతో ఎవరు గెలిచే అవకాశం లేదని భావిస్తున్నారు. దీనితో రెండో ప్రాధాన్య ఓట్లు ఎవరికి ఎక్కువగా పోలయ్యాయి.. ఎవరు.. ఎవరి తలరాతలు మార్చనున్నారు అన్నది అంతుపట్టకుండా మారింది. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో 56 మంది పోటీలో ఉన్నా ఎలిమినేషన్ పద్ధతిలో ఓట్ల లెక్కింపు చేపట్టే క్రమంలో తక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థినుంచి మొదలు పెట్టి ఎలిమినేట్ చేస్తూ అతడి బ్యాలెట్‌లో రెండో ప్రాధాన్యత ఓట్లు ఎవరికి వస్తే వారికి వాటిని కలుపుతూ వెళ్తారు. దీంతో సోమవారం కౌంటింగ్ ప్రక్రియను ప్రారంభించినా రాత్రి వరకు బ్యాలెట్లను వేరు చేసి కట్టలు కట్టడం పూర్తవుతుందని, ఆ తర్వాత ఓట్ల లెక్కింపు చేపడితే ఓట్ల లెక్కింపు పూర్తయి ఫలితాలు వెలువడేందుకు మరో రెండురోజులైనా పడుతుందని భావిస్తున్నారు.

విద్యారంగాన్ని పరిరక్షించాలి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్‌కు సన్మానం



రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న బండి సంజయ్ కుమార్

సిరిసిల్ల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో విద్యారంగాన్ని మరింత పరిరక్షించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ సూచించారు. సిరిసిల్ల పట్టణం శివనగర్‌లోని కుసుమ రామయ్య బాలుర ఉన్నతపాఠశాలలో పనిచేస్తున్న సైన్స్ ఉపాధ్యాయుడు పాకాల శంకర్‌గౌడ్ ఇటీవల రాష్ట్ర ఉత్తమఉపాధ్యాయుడిగా అవార్డు తీసుకున్నారు. కరీంనగర్‌లో ఆదివారం కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్‌ను పాకాల శంకర్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలవడంతో అయనను మంత్రి సన్మానించారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ శంకర్‌గౌడ్ 27సంవత్సరాలుగా ప్రభుత్వఉపాధ్యాయుడిగా పని చేస్తూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు కృషి చేస్తున్నారని అన్నారు. విద్యార్థులల్లో శాస్త్రీయ వైఖరులు పెంపొందించడానికి వినూత్న ఆవిష్కరణల కోసం నిరంతరం విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని ప్రశంసించారు. సామాజిక అంశాలపై వివిధ తెలుగు దినపత్రికల్లో ఆర్టికల్స్‌రాస్తూ సమాజాన్ని చైతన్యపరుస్తున్నారని విద్యార్థులతో కలిసి తయారు చేసిన అనేక సైన్స్ ప్రాజెక్టులు, ఎగ్జిబిట్స్‌లు రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికారిక ప్రతినిధి సంగప్ప, నాయకులు సంపత్, అనిల్‌కుమార్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ

- కోడెమొక్కులు చెల్లించుకున్న భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. ఇతరప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఉదయాన్నే ఆలయ ధర్మగుండంలో పవిత్రస్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. ధర్మదర్శనం, శీఘ్రదర్శనం క్యూలైన్‌ల ద్వారా భక్తులు ఆలయంలోకి చేరుకుని పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. రాజన్నకు అత్యంత ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయాల్లో కుంకుమ పూజలో పాల్గొని బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకుని తరించారు.

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి శ్రీపాదరావు కృషి

- రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు


మంథని, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ శాసనసభా స్పీకర్ స్వర్గీయ శ్రీపాదరావు కృషి చేశారని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి సందర్భంగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు పట్టణంలోని శ్రీపాద చౌరస్తా, ఆర్సీ కట్టలోని శ్రీపాదరావు విగ్రహాలకు ఆదివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి కోసం కృషిచేసిన నాయకుడు శ్రీపాదరావు అని, ఆయన ఉమ్మడి రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా సమర్థవంతంగా విధులు నిర్వహించారన్నారు. అయన స్ఫూర్తితో రాజకీయాల్లోకి వస్తే మంథని ప్రాంత ప్రజల ఆశీర్వాదం మేరకు తనకు శాసనసభ్యుడిగా అవకాశం కలిగిందన్నారు. శ్రీపాదరావు ఆశయ సాధనలో భాగంగా విద్య, వైద్యం, ఉపాధి పరంగా ఈ ప్రాంతంలో నివసించే అనేక మందికి మేలు చేస్తామన్నారు. తనకు ఉన్న శక్తి మేరకు మంథని ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తానన్నారు. మంథని రైతులకు సాగు నీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలనేది శ్రీపాదరావు లక్ష్యమని, దానిని నెరవేర్చే దిశగా పని చేస్తామన్నారు. యూత్‌కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. మంథనిలోని సామాజిక ఆసుపత్రిలో పండ్లు, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీచేశారు. కాంగ్రెస్ పార్టీ నేతలు వొడ్నాల శ్రీనివాస్, పెంద్రు రమాదేవీ సురేష్‌రెడ్డి, శశిభూషన్‌కాచే, కొత్త శ్రీనివాస్, ఐలి ప్రసాద్, లింగయ్యయాదవ్, పోలు శివ, కుడుదుల వెంకన్న, ఉప్పట్ల శ్రీనివాస్, సంతోషిణి, గోటికార్ కిషన్‌జీ, రావికంటి సతీష్, ఎరుకల ప్రవీణ్, మంథని సత్యం, బండారి ప్రసాద్, కొండ శంకర్ పాల్గొన్నారు.



మంథనిలో శ్రీపాదరావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

అవగాహనే కీలకం

- జాగ్రత్తలు.. చికిత్సతో వినికిడి లోపాన్ని నివారించవచ్చు
- నేడు ప్రపంచ వినికిడి నివారణ దినోత్సవం



సుభాష్‌నగర్, మార్చి2 (ఆంధ్ర జ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా 150 కోట్లమంది వినికిడిలోపంతో బాధ పడుతున్నారని ప్రపంచ ఆరోగ్య సంస్థ (వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్) వెల్లడించింది. వినికిడి లోపాలకు అనేక కారణాలు ఉన్నాయి. సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే వినికిడి లోపాలన్ని తగ్గించవచ్చు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రపంచ వినికిడి నివారణ దినోత్సవాన్ని 2007 నుంచి ప్రతి సంవత్సరం మార్చి 3న నిర్వహిస్తోంది. వినికిడి లోపం నివారణ గురించి సమాచారాన్ని వ్యాప్తి చేయడం, మెరుగైన వినికిడి సంరక్షణను ప్రోత్సహించడం ఈ దినోత్సవ ముఖ్య లక్ష్యం.

● ఈ సంవత్సర నినాదం

వినికిడి నివారణ దినోత్సవంలో భాగంగా వినికిడి లోపంతో బాధపడుతున్న వారిని ఒకచోట చేర్చి దాని ఎపిడెమియోలాజికల్ ప్రొఫైల్, రోగ నిర్ధారణ, చికిత్స గురించి అవగాహన కల్పిస్తారు. 'వినికిడిపై మన మనస్తత్వాన్ని మార్చుకోవాలి..మనకు మనం బలోఎతం కావాలి' అనేది ఈ సంవత్సరం నినాదం. ప్రజలు తమ ఆలోచన విదానం, ధోరణి మార్చుకోవాలని, వినికిడి లోపం ఉన్న వారిని చిన్నచూపు చూడకుండా వారికి మనోధైర్యాన్ని ఇవ్వాలనేది దాని అర్థం.

నిర్లక్ష్యం చేయొద్దు..

- డాక్టర్ ప్రశాంత్, ఈఎన్‌టీ, షాలిని హస్పిటల్



వినికిడి లోపాన్ని నిర్లక్ష్యం చేయవద్దు. సకాలంలో గుర్తించి సంబంధిత డాక్టర్ వద్దకు వెళ్లాలి. వినికిడిలోపంతో బాధపడుతున్నవారిని చిన్నచూపు చూడకూడదు. ఈ విషయంలో సమాజం జాగృతం కావాలి. వినికిడి లోపంతో బాధపడుతున్న వారికి కుటుంబ సభ్యులు, సమాజం అండగా ఉండాలి. వారి లోపాన్ని ఎత్తిచూపకుండా అది చిన్నదే అన్న భావన కల్పించాలి.

ఆదివాసీలను హతమారుస్తున్న కేంద్రప్రభుత్వం

- పౌరహక్కుల రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు



మాట్లాడుతున్న పౌరహక్కుల రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు

కళ్యాణ్‌నగర్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దండకారణ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను హతమారుస్తుందని, ఆపరేషన్ కగార్ వెంటనే నిలిపివేయాలని పౌరహక్కుల రాష్ట్ర కార్యదర్శి నారాయణరావు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో డిఫెన్స్ ఫోర్స్ నాయకులు సీపెల్లి రాజేశం అధ్యక్షతన ఏర్పాటు చేసిన రాజ్యాంగ పరిరక్షణ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దండకారణ్యంలో ఆపరేషన్ కగార్ పేరిట మావోయిస్టులను, ఆదివాసీలను కేంద్రప్రభుత్వం హతమారుస్తుందని, దీనిపై రాష్ట్రప్రభుత్వాలు జోక్యం చేసుకుని ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలను లేకుండా చేసి అడవుల్లో ఉన్న అపారమైన ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలకు అమ్ముకోవడానికి కేంద్ర ప్రభుత్వం చూస్తుందని ఆరోపించారు. దీనిని ప్రజలు, మేధావులు, ప్రజాసంఘాల నాయకులు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రైతు సమస్యల సాధనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ దేశ సంపద 500మంది చేతుల్లో ఉందని, పాలకులు పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ దేశ సంపదను కొల్ల గొడుతున్నారని, రాజ్యాంగం కల్పించిన జీవించే హక్కు అందరికి వర్తింప చేయాలని, కనీస సదుపాయలు కూడు, గుడ్డ, విద్య, వైద్యం, ఉపాధి అందించాలని కోరారు. 1/70 యాక్టును పకడ్బందీగా అమలు చేస్తూ ఆదివాసీలకు రక్షణ కల్పించి అడవి సంపదను కాపాడుతున్న ఆదివాసీలపై దాడులను ఆపాలని, పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువకులు, కార్మికులు, కర్షకులు, రైతులు ఏకమై ఐక్య పోరాటాలతో రాజ్యాంగ రక్షణకు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మావోయిస్టుల నెపంతో ఆదివాసీలను అంతం చేసిన కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.2కోట్ల నష్ట పరిహారం చెల్లించి సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ చేయించాలని డిమాండ్‌చేశారు. పౌర హక్కుల సంఘం నాయకులు వినోద్, బొడ్డుపెల్లి రవి, లక్ష్మణ్, ఏలేశ్వరం వెంకటేష్, వెల్తూరి సదానందం, రాములు, పార్వతక్క, ఆనంద్, శ్రీకాంత్, జనార్ధన్, ప్రకాష్, మల్లేష్, లవన్ కుమార్, శ్రావణ్, మహేందర్, లింగన్న, మల్లన్న, స్వామి పాల్గొన్నారు.

శ్రీపాదరావు స్మారక రాష్ట్రస్థాయి కరాటే పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): శ్రీపాదరావు రాష్ట్రస్థాయి కరాటేపోటీలు కరీంనగర్ జిల్లా కేంద్రంలోని రంగినేని గార్డెన్స్‌లో ఆదివారం ప్రారంభమయ్యాయి. మాజీస్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 88వజయంతి సందర్భంగా నిర్వహించిన పోటీలను ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, టోర్నమెంట్ కమిటీ చైర్మన్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం మాట్లాడుతూ శ్రీపాదరావు అజాతశత్రువు అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నారని అన్నారు. కరాటేతో ఆత్మరక్షణ, మానసిక ధైర్యం లభిస్తాయన్నారు. అనంతరం రాష్ట్రస్థాయి పోటీలను ఏర్పాటు చేసిన నిర్వాహకులు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, వసంత్ కుమార్, సురభి వేణుగోపాల్‌ను అభినందించారు. కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి పురుమల్ల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ కార్పొరేటర్ కాశెట్టి లావణ్య శ్రీనివాస్, ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, అర్ష మల్లేశం, నగేష్ ముదిరాజ్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ధన్నసింగ్, సుదర్శన్, బొబ్బిలి విక్టర్ పాల్గొన్నారు.



పోటీలకు హాజరైన క్రీడాకారులు

వైభవంగా సీతారామాంజనేయస్వామి రథోత్సవం

ఎల్లారెడ్డిపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలోని సీతారామాంజనేయస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం అభిషేకం, హోమం తదితర కార్యక్రమాలను అత్యంత వైభవంగా జరిపించారు. అనంతరం నూతనంగా తయారు చేసిన రథంపై స్వామివారిని గ్రామవీధులగుండా ఊరేగించారు. భక్తులుభజనల నడుమ స్వామివారు ముందుకు కదిలారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, రాజయ్య, సురేందర్‌రెడ్డి, అంజిల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కిషోర్, మనోజ్, శరత్‌రెడ్డి, పవన్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.



రథంపై ఊరేగుతున్న స్వామి వారు

సృష్టి వైజ్ఞానిక ప్రదర్శనలో దమ్మన్నపేట విద్యార్థుల ప్రతిభ



ఆవిష్కరణతో విద్యార్థులు, గైడ్ టీచర్ సంపత్ కుమార్

గంభీరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సృష్టి వైజ్ఞానిక ప్రదర్శనలో గంభీరావుపేట మండలం దమ్మన్నపేట విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్, ప్రయాస్ వారి ఆధ్వర్యంలో ఐఐటీ హైదరాబాద్ వారు ఫిబ్రవరి 24న ఆన్‌లైన్‌లో నిర్వహించిన సృష్టి వైజ్ఞానిక ప్రదర్శన 2025లో రాష్ట్ర నలుమూలల నుంచి 135 జట్లు తమ ఆవిష్కరణలను రిజిస్టార్ చేసుకున్నారు. అందులో నుంచి 35 మంది అత్యుత్తమ ఆవిష్కరణలను ఎంపికచేసి మార్చి1న ఐఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రదర్శించే అవకాశం కల్పించారు. ఈ35 ఆవిష్కరణల నుంచి తిరిగి 10అత్యున్నత ఆవిష్కరణలు ఎంపిక చేశారు. ఇందులో దమ్మన్నపేటకు ప్రభుత్వ పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు సుప్రియ, శ్రీచైత్ర, మధుప్రియ గైడ్ టీచర్ తాడూరి సంపత్ కుమార్ ఆధ్వర్యంలో తయారు చేసిన స్మార్ట్ వాష్ బేసిన్ అనే ఆవిష్కరణ ద్వితీయ స్థానంలో, విశాల్, హర్షవర్ధన్ తరుణ్, మధు తయారు చేసిన జంతు మృతదేహాలను తీసే ట్రాలీ ఆవిష్కరణ 8వ స్థానంలో నిలిచి మే నెలలో నిర్వహించే ఫ్యూచర్ ఇన్నోవేషన్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. వీరికి ఐఐటీ డైరెక్టర్ బీస్ మూర్తి సంగారెడ్డి జిల్లాకలెక్టర్ వల్లూరు క్రాంతి, రూరల్ డెవలప్ మెంట్ సెంటర్ డైరెక్టర్లు అభినందనలు తెలిపారు. ఐఐటీ ప్రొఫెసర్లు హిమబిందు, షాహిద్‌లు జ్ఞాపికలను అందజేశారు. చక్కటి ప్రదర్శనచేసిన దమ్మన్నపేట పాఠశాల విద్యార్థులను అధ్యాపకులు అభినందించారు.

ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం

- జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల కృష్ణ



ప్రశంసాపత్రాలతో తైక్వాండో పోటీల విజేతలు

జగిత్యాల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణకు తైక్వాండో దోహదం చేస్తుందని జిల్లా తైక్వాండో అసోసియేషన్ చైర్మన్ మంచాల కృష్ణ అన్నారు. ఆదివారం జగిత్యాలపట్టణంలోని శుభమస్తు కన్వెన్షన్ హాలులో ఉమ్మడి జిల్లా స్థాయి తైక్వాండో పోటీలను జగిత్యాల జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 270 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారు. సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో పోటీలను నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. విజేతలకు మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా మంచాల కృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా తైక్వాండో ఉపయోగ పడుతుందన్నారు. ఈకార్యక్రమంలో జగిత్యాల రూరల్ సీఐ కృష్ణారెడ్డి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రవి కుమార్, తైక్వాండో స్టేట్ అబ్జర్వర్ వెంకటస్వామి, నాయకులు గంగారాం, ఐక్యూ మైండ్స్ సంస్థ ఎండీ యాసిన్, సుధాకర్, శంకర్, శివకృష్ణ, సంతోష్, శ్రీధర్, శ్రీనివాస్, గంద సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

800 రూపాయల వెండి నాణెం

- భగవాన్ పార్శ్వనాథుడి స్మారక నాణెం విడుదల

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): జైన మత 23వ తీర్థంకరుడు భగవాన్ పార్శ్వనాథుడి 2800 నిర్యాణ సంవత్సరం సందర్భంగా ఆయన స్మారకార్థం భారత ప్రభుత్వం 800 రూపాయల స్మారక నాణేన్ని విడుదల చేసింది. ఈ నాణేన్ని శనివారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సేకరణ కర్త బుడిమె ప్రకాష్ అందుకున్నారు. దేశంలో వివిధ ప్రముఖుల జ్ఞాపకార్థం విడుదల చేస్తున్న నాణేలను అంతర్జాతీయ కరెన్సీని సేకరిస్తున్న ప్రకాష్ ఖాతాలో మరో అరుదైన నాణెం చేరింది. ఈ 800 రూపాయల నాణెం 44 మిల్లీమీటర్ల డయామీటర్, 40 గ్రాముల బరువు ఉంది. ఈ నాణేన్ని 99.9 శాతం వెండితో తయారు చేశారు.



రూ. 800 వెండి నాణెం

సమయపాలన పాటించకుంటే చర్యలు

- శ్రీనివాసగౌడ్, ఎంఈవో



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంతమంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు?

ఎంఈవో: మండలంలో ప్రభుత్వ పాఠశాల్లో 3,363 మంది, ప్రైవేట్ పాఠశాల్లో 1682 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: కొంత మంది ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి?

ఎంఈవో: ఉపాధ్యాయులందరు సమయపాలన పాటించాలని ఆదేశాలు జారీచేశాం. స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు తరచూ పాఠశాలలను తనిఖీలు చేస్తున్నారు. సమయపాలన పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: పాఠశాలలో మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం పెడుతున్నారా?

ఎంఈవో: ప్రభుత్వం సూచించిన మెనూను అన్ని పాఠశాల్లో అమలు చేస్తున్నాం. పాఠశాలలో మధ్యాహ్న భోజన కమిటీలు ఏర్పాటు చేశాం.

ఆంధ్రజ్యోతి: పదోతరగతి పరీక్షలు ఎంతమంది విద్యార్థులు హాజరవుతున్నారు?

ఎంఈవో: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 456 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలకు హాజరవుతున్నారు.

ఆంధ్రజ్యోతి: ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తున్నారు?

ఎంఈవో: వెనుకబడిన విద్యార్థులను గుర్తించి గ్రూపులుగా తయారు చేసి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ఇంటికి వెళ్లాక ఏమిచేస్తున్నారో తల్లిదండ్రులను అడిగి తెలుసుకుంటున్నాం. ఈసారి కూడా వందశాతం ఉత్తీర్ణత సాధిస్తాం.

- ఇల్లంతకుంట(ఆంధ్రజ్యోతి)

శ్రీపాద రావు సేవలు మరువలేనివి

- కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా
- జిల్లా వ్యాప్తంగా మాజీ స్పీకర్ శ్రీపాదరావు జయంతి వేడుకలు

సిరిసిల్ల, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు సేవలు మరువలేనివని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అన్నారు. ఆదివారం రాజన్నసిరిసిల్ల జిల్లావ్యాప్తంగా శ్రీపాదరావు జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా యువజన మరియు క్రీడల శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాజీ స్పీకర్ శ్రీపాదరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అన్ని వర్గాలకు సేవలు అందేవిధంగా పనిచేశారని అన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన శాఖ అధికారి రాందాస్, ఎల్‌డీఎం మల్లిఖార్జున్ జడ్పీ సీఈవో వినోద్, బీసీ వేల్ఫేర్ అధికారి రాజమనోహర్ పాల్గొన్నారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల అర్బన్‌పరిధిలోని సర్దాపూర్‌లోని 17వ పోలీస్ బెటాలియన్‌లో శ్రీపాదరావు చిత్రపటానికి అసిస్టెంట్ కమాండెంట్ సీహెచ్ సాంబశివరావు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఆర్ఐలు శంకర్, శ్రీనివాస్, రఘునాథ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





నివాళులర్పిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అధికారులు, సర్దాపూర్ పోలీస్ బెటాలియన్‌లో..

● **కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

సిరిసిల్ల టౌన్: దుద్దిళ్ల శ్రీపాదరావు ఆయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నాగుల సత్యనారాయణ అన్నారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం గాంధీచౌక్ వద్ద సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఉమ్మడి రాష్ట్ర అసెంబ్లీ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకల సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంగళ అశోక్, ఉపాధ్యక్షుడు వంగ మల్లేశంగౌడ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఆకునూరి బాలరాజు, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎండీ అహ్మద్, మార్కెట్ కమిటి డైరెక్టర్లు వెంకటేశం, నర్సయ్య, పీసీసీ కార్యదర్శి గడ్డం నర్సయ్య, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్‌గౌడ్, మాజీ కౌన్సిలర్లు నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో యుజవన కాంగ్రెస్ నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు అంతగిరి వినయ్‌కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి పసుల వెంకటి, నాయకులు ఒగ్గు రమేష్, మచ్చ రాజేశం, అల్లెపు రజనీకాంత్, మామిడి రాజు, జమాల్, ఒగ్గు మధు, కుంటాల శేఖర్, యాస నిఖిల్, హరీష్ పాల్గొన్నారు.

చందుర్తి: చందుర్తి మండలం రామన్నపేటలో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా జనరల్ సెక్రెటరీ, శ్రీధర్‌బాబు యువసేన జిల్లా అధ్యక్షుడు భీమరాజు కనకరాజు, మాజీ ఉపసర్పంచ్ తిప్పని నారాయణ, నాయకులు ముదిగంపల్లి కిషన్, చిన్నవేణి రవి, దొంతుల మహిపాల్‌రెడ్డి, నాయని గంగాధర్, రామిడి నరేష్, బొడ్డు రాజయ్య, భీమరాజు ఆనందం, రాజయ్య, మెరుగు అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: దివంగత మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. శ్రీపాదరావు చేసిన సేవలను కొనియాడారు. ప్రభుత్వం ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని అన్నారు. అనంతరం స్థానిక ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సయ్య, గౌస్, రాంరెడ్డి, శ్రీనివాస్, బుచ్చాగౌడ్, బాబు, బాల్‌రెడ్డి, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.





సిరిసిల్లలో శ్రీపాదరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు, రామన్నపేటలో కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఫలితాలపై ఉత్కంఠ

(5వ పేజీ తరువాయి)

మల్క కొమురయ్య, బీఎస్పీ అభ్యర్థి యాటకారి సాయన్న, దళిత బహుజన పార్టీ అభ్యర్థి గవ్వల లక్ష్మి, స్వతంత్రులుగా వై అశోక్‌కుమార్, కంటె సాయన్న, కూర రఘోత్తంరెడ్డి, వంగ మహేందర్‌రెడ్డి తదితరులు ప్రచారం చేశారు. పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి చిన్నమైల్‌కు వారి పార్టీ శ్రేణులు ప్రచారాలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఈసారి ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయకపోయినా చివరిక్షణంలో బీఎస్పీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు జిల్లాలోని నాయకులు ప్రచారం చేయడం కనిపించింది. ఇది ఎంతవరకు అభ్యర్థికి లాభి స్తుందనే చర్చ సాగుతోంది. పోలింగ్ సరళి లెక్కలు వేస్తూ ఎవరికి మెజార్టీ ఎక్కువ వస్తుంది.. మొదటి, రెండో ప్రాధాన్యత ఓట్లపై కూడా చర్చలు చేస్తూ వేల రూపాయల్లోనే పందెలు కాస్తున్నట్లు తెలిసింది. సర్వత్రా జరుగుతున్న చర్చల్లో ఎమ్మెల్సీ ఫలితాలు ఉత్కంఠతకు తెరలేపాయి.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిషన్

సిరిసిల్ల రూరల్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని చైతన్య భారత్ స్కూల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ అకట్టుకుంది. సైన్స్ దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ పరికరాలను ప్రదర్శించగా విద్యార్థుల తల్లిదండ్రులు పరిశీలించి ప్రశంసించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ అడెపు రవీందర్, ప్రిన్సిపాల్ అడెపు కళ్యాణి, అడెపు రేవంత్, బూర శ్రీనివాస్, గెంట్యాల భూమేష్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



సైన్స్ పరికరాల ప్రదర్శన

రోడ్డు ప్రమాదంలో వానరం మృత్యువాత

- ఖననం చేసిన యువకులు

ఎల్లారెడ్డిపేట, మార్చి2(ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం రాచర్లబొప్పాపూర్ గ్రామ శివారులోని ప్రధాన రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వానరం మృత్యువాత పడింది. గమనించిన స్థానిక యువకులు స్పందించి గుంతను తవ్వి ఖననం చేశారు. మృత్యువాత పడిన వానరానికి ఖననం చేయడం పట్ల యువకులను పలువురు అభినందించారు.

ఎక్కడి చెత్తా అక్కడే..



గంభీరావుపేట నమాజ్ చెరువు కట్ట పక్కనే ఉన్న చెత్త

గంభీరావుపేట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): గంభీరావుపేట మండల కేంద్రంలో ఎక్కడి చెత్తా అక్కడే పేరుకుపోతోంది. నెలల తరబడి చెత్తా అలాగే ఉండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. పలు చోట్ల పారిశుధ్యం అధ్వానంగా మారింది. ప్రభుత్వ ఆసుపత్రి వెళ్లే దారిలో నమాజ్ చెరువు కట్టపై చెత్తాచెదారం దర్శనమిస్తోంది. నమాజ్ చెరువు కట్ట సమీపాన వ్యర్థ పదార్థాలు పారేయడంతో తీవ్ర దుర్గంధం వస్తోంది. దీంతో అటు వైపు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీ అధికారులకు పలు సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పశువులకు మేతగా వరి పొలాలు



ఎండిన పొలాలను మేస్తున్న పశువులు

రుద్రంగి మార్చి 2 (ఆంధ్రజ్యోతి): రుద్రంగి మండలంలో పచ్చని పంట పొలాలకు నీరు లేక నెర్రెలు వారుతున్నాయి. వేసవికాలం ప్రారంభంలోని పంట పొలాలకు నీరందతిక వరిపంటలు ఎండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటిపోయి బోరు బావులు బోరుమంటున్నాయి. రుద్రంగి మండల కేంద్రానికి చెందిన మారంపల్లి పోషయ్యకు చెందిన రెండు ఎకరాల వరి పంటకు నీరు అందక పూర్తిగా ఎండిపోయింది. దీంతో పంట పొలం పశువులకు మేతగా మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా హన్మంతరెడ్డి

ఇల్లంతకుంట, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముస్కానిపేట గ్రామంలోని లక్ష్మీనర్సింహస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బద్దం హన్మంతరెడ్డి ఎన్నికయ్యారు. గ్రామంలో ఆదివారం సమావేశం అయిన గ్రామస్తులు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా సావనపెల్లి శంకర్, కార్యదర్శిగా సామ నర్సింహ్మారెడ్డి, కోశాధికారిగా కొమ్ముల నర్సింహ్మారెడ్డి ఎన్నికయ్యారు. నూతన కమిటీకి గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుల ఆరోపణలు అవాస్తవం

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి



పంటలను పరిశీలిస్తున్న యెల్ల బాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు

ముస్తాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మానేరు కెనాల్ నీళ్ల అందక పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ నాయకులు పేర్కొనడంలో వాస్తవం లేదని ముస్తాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఎల్లమ్మ ఆలయ సమీపంలో మానేరు కెనాల్ ద్వారా పారుతున్న వరిపంటలను కాంగ్రెస్ నాయకులు ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా యెల్ల బాల్‌రెడ్డి మాట్లాడుతూ కెనాల్ పరిధిలో పారే ఆయకట్టు సాగు ఒక ఎకరం కూడా ఎండిపోవడం లేదని పేర్కొన్నారు. కెనాల్‌తో సంబంధం లేకుండా ఉన్న పొలాలు భూగర్భజలాలలు లేక ఎండిపోతున్నాయని మానేరు కెనాల్ పరిధిలో పంటలు ఎండిపోతున్నాయని ఆరోపించడం బీఆర్ఎస్ నాయకులకు తగదన్నారు. రైతులను అయోమయానికి గురి చేయొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ తలారి రాణి నర్సయ్య, పీఏసీఎస్ చైర్మన్ అన్నం రాజేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గజ్జెల రాజు, వేముల సత్య నారాయణ, శీల ప్రశాంత్, రంజాని నరేశ్, కస్తూరి రాజు, ఉచ్చిడి బాల్‌రెడ్డి మామిండ్ల అంజనేయులు పాల్గొన్నారు.

నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

- బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

తంగళ్లపల్లి (సిరిసిల్ల రూరల్), మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన అబ్బాడి రాజిరెడ్డిని ఇటీవల ప్రభుత్వ భూమిని కబ్జాచేసి పట్టా చేసుకున్నాడని పోలీస్‌లు అరెస్ట్ చేశారు. అయకు మాజీ మంత్రి కేటీఆర్ న్యాయవాదులతో మాట్లాడి బెయిల్ మంజూరు చేయించారు. రాజిరెడ్డితోపాటు అయన కుటుంబీకులను ఆదివారం మాజీమంత్రి కేటీఆర్ వారికి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి కుటుంబంలోని ఏడాది వయస్సు ఉన్న బాబును కేటీఆర్ కొద్దిసేపు ఎత్తుకున్నారు. బాబుకు డైపర్ వేశారా, నేను పలు ఫంక్షన్‌లకు పోవాల్సి ఉంది ఏమైనా కథ చేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందని హాస్యస్పద వ్యాఖ్యాలు చేయడంతో అక్కడ ఉన్న వారందరు నవ్వారు. కార్యక్రమంలో న్యాప్‌క్యాబ్ చైర్మన్ కొండూరీ రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట అగయ్య, సెస్ చైర్మన్ చిక్కాల రామరావు, మండల అధ్యక్షుడు గజభీంకార్ రాజన్న, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య, మాజీ సర్పంచ్ మాట్లమధు తదితరులు పాల్గొన్నారు.

నీళ్లులేక పంటలు ఎండిపోతున్నాయి

అప్పులుచేసి సాగుచేసిన పంటలు చేతికోచ్చే సమయంలో నీళ్లలేక ఎండిపోతున్నాయని మా చెరువుల్లోకి రంగనాయక సాగర్ నీటిని తరలించాలని నాయకులతోపాటు అధికారులను కోరినా ఎవరు పట్టించుకోవడం లేదంటూ తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామ రైతులు ఆదివారం ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లెల్ల గ్రామానికి చెందిన రైతు అబ్బాడి రాజిరెడ్డిని పరామర్శించేందుకు వచ్చిన కేటీఆర్‌ను రైతులు కలిశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చెరువులోకి రంగనాయక సాగర్ నీళ్ల రావడం లేదని దీంతో తాము కష్టపడి అప్పులు చేసి సాగు చేసిన పంటలు చేతికోచ్చే సమయంలో నీళ్ల లేక పంటలు ఎండిపోతు న్నాయన్నారు. నీళ్ల ఇవ్వాలంటూ కాంగ్రెస్ నాయకుల తోపాటు జిల్లా అధికారులను కలిసి విన్నవించినా ఎవరు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేద న చెందారు. దీంతో స్పందించిన కేటీఆర్ రంగనాయక సాగర్ ఎస్‌ఈ రవీందర్‌రెడ్డితో ఫోన్‌లో మాట్లాడారు. రంగనాయక సాగర్ నుంచి జిల్లెల్ల గ్రామంలోని చెరు వులకు ఎందుకు నీటిని అందించ డం లేదని అడిగారు. కాలువ నిర్మాణానికి రైతులు భూమిని ఇవ్వక పోవడంతో కాలువ పనులు మధ్యలోనే నిలిచి పోయాయని ఎస్‌ఈ చెప్పారు. డంతో స్పందించిన అబ్బాడి చంద్రరెడ్డి అనే రైతుకు చెందిన 30 గుంటల భూమికి నష్టపరిహారం ఇవ్వకపోవడంతో పనులను అడ్డుకు న్నారని అ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పనులు కొనసాగించాలని కేటీఆర్ కోరారు. అప్పటి వరకు తాత్కాలికంగా వేసి కాలువల ద్వారా జిల్లెల్ల చెరువుల్లోకి నీటిని నింపి పంటలు ఎండిపోకుం డా చూడాలని సూచించారు.



జిల్లెల్లలో రైతులతో మాట్లాడుతున్న కేటీఆర్



సిరిసిల్లలో వధూవరులతో మాట్లాడుతున్న కేటీఆర్

మండలంలోని టెక్స్‌టైల్ పార్క్ ఇందిరమ్మ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిలుక రఘువర్మ ఇటీవల గుండెపోటుతో మృతిచెందగా ఆ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించి రెండు లక్షల రూపాయల అర్థిక సహాయం అందించారు. అనంతరం మండలంలోని అంకుసాపూర్‌లో వివాహానికి వెళ్లి దినేష్ దంపతులను ఆశ్వీరించారు.

● **సిరిసిల్ల టౌన్:** నియోజకవర్గం పర్యటనలో భాగంగా సిరిసిల్లకు వచ్చిన కేటీఆర్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో టీస్టాల్ యజమాని బత్తుల శ్రీనివాస్ కుటుంబాన్ని కేటీఆర్ పరామర్శించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను పాటించకుండా బత్తుల శ్రీనివాస్ కేటీఆర్ ఫ్లెక్సీని పెట్టుకున్నాడని టీస్టాల్ డబ్బాను మున్సిపల్ అధికారులు తొలగించారు. అనంతరం పట్టణంలోని సాయిమణికంఠ గార్డెన్‌లో బీఆర్ఎస్ నాయకుడు కుంభాల మల్లారెడ్డి కూతురు వివాహ వేడుకలో కేటీఆర్ పాల్గొని నవవధువరులను ఆశీర్వదించారు. ఇటీవల పాత్రికేయుడు పిల్లి శ్రీనివాస్ కుమారుడి వివాహం జరగగా స్థానిక సర్దార్‌నగర్‌లోని వారి ఇంటికి వెళ్లి నవవధువరులకు పుష్పగుచ్ఛాలను అందించి ఆశీర్వదించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి గూడూరి ప్రవీణ్, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి, నాయకులు బొల్లి రామ్మోహన్, న్యాలకొండ రాఘవరెడ్డి, అగ్గిరాములు పాల్గొన్నారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో కేంద్ర గిడ్డంగుల సంస్థ కీలకం

సుల్తానాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థిక అభివృద్ధిలో కేంద్ర గిడ్డంగుల సంస్థ కీలక పాత్ర పోషిస్తుందని సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ మేనేజర్ స్పందన అన్నారు. గర్రెపల్లిలోని సిడబ్ల్యుసి గోదాములలో ఆదివారం వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గర్రెపల్లిలో ఉన్న సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ (కేంద్ర గిడ్డంగుల సంస్థ) గోదాముల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్పందన మాట్లాడుతూ దేశంలో ఆహార ఉత్పత్తులను భవిష్యత్తు అవసరాల కోసం నిల్వ చేయడంలో గిడ్డంగుల సంస్థ సేవలు వెలకట్టలేనివని అన్నారు. గిడ్డంగుల సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పాల్గొన్న కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు రత్నాకర్ పోటే, గజేంద్ర తాయివాడే తదితరులను గోదాం మేనేజర్ స్పందన సత్కరించారు. ఉద్యోగులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

బహుజన చైతన్యం కోసమే జ్ఞానదీక్ష

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): బహుజన, అణగారిన వర్గాల్లో చైతన్యం కోసమే పూలె, అంబేద్కర్ జ్ఞాన మాల అని ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ ఆకునూరి బాలంకుస్ పేర్కొన్నారు. ఆదివారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసిన అనంతరం మాట్లాడారు. రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అణగారిన వర్గాలను చైతన్యవంతులను చేయడమే లక్ష్యంతో జ్ఞానమాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. అంబేద్కర్, పూలె ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతీ ఆదివారం వివరించారు. శంకర్‌నాయక్, తిరుపతి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్‌బాల్ పోటీలకు క్రీడాకారులు

కరీంనగర్ కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి):నాలుగో దక్షిణ భారత జాతీయ స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో ప్రతిభ చాటినట్లు ఉమ్మడి జిల్లా షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఆరిఫ్, మహమ్మద్ ముఫజిల్ అహ్మద్ తెలిపారు. నల్గొండలోని ఎన్‌జీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయస్థాయి పోటీలు కొనసాగుతున్నట్లు పేర్కొ న్నారు. సబ్ జూనియర్ విభాగంలో మనోజ్ఞశ్రీ, టి.సంజయ్ సాహిత్, సహృద్, జూనియర్ విభాగంలో కె.వికాస్, ఎం.సాత్విక్, బి.శ్రీవిద్య, సీనియర్ విభాగంలో పూదరి అనిల్ కుమార్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఉమ్మడి జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి అభినందించారు.

వర్గీకరణ ఉద్యమ అమరులకు నివాళులు

కోల్‌సిటీటౌన్, మార్చి 2(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ పోరులో అసువులు బాసిన మాదిగ అమరులకు ఎంఆర్‌పీఎస్, మహాజన సోషలిస్టు పార్టీ ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఆదివారం గోదావరిఖనిలో జరిగిన కార్యక్రమంలో ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి కొండల రాజేందర్ మాట్లాడారు. 30 ఏళ్ళ సుదీర్ఘ ఉద్యమంలో అనేక మంది జీవితాలను త్యాగం చేసినట్టు పేర్కొన్నారు. ఎస్సీ వర్గీకరణ ద్వారానే ఉపకులాలకు తగిన న్యాయం జరుగుతుందన్నారు.

తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణ చెప్పాలి

- రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

సిరిసిల్ల టౌన్, మార్చు 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం సిరిసిల్ల పట్టణం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణాలు, గ్రామాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, రెడ్డి సామాజిక వర్గం స్నేహపూర్వకంగా సఖ్యంగా ఉంటున్న వారి మధ్య చిచ్చుపెడుతూ తీన్మార్ మల్లన్న రాజకీయ పబ్బం గడుపుతున్నాడని ఆరోపించారు. మీడియాను అడ్డుపెట్టుకొని బెదిరింపులకు పాల్పడుతూ అక్రమార్జనకు పాల్పడ్డాడని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక కులసంఘాలు వారి హక్కుల సాధన కోసం ఉద్యమాలు చేసిన చరిత్ర ఉందన్నారు. మంద కృష్ణ మాదిగా దాదాపు 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం చేసిన పోరాటంలో ఏ కులంను విమర్శించ లేదన్నారు. బీసీ సంఘం నాయకుడు ఆర్ కృష్ణయ్య బీసీల పక్షాన పోరాటాలు చేస్తూ ఏ ఒక్క కులాన్ని తిట్టలేదన్నారు. తీన్మార్ మల్లన్న కేవలం రెడ్డిల హక్కులను కాలరాయడమే ఎజెండాగా పెట్టుకున్నా డని ఆరోపించారు. రెడ్డిలపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే వెనక్కి తీసుకొని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

లేని పక్షంలో ఎమ్మెల్సీ పదివి పోయేంత వరకు రాష్ట్ర వ్యాప్తంగా రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో రెడ్డి సంఘం తంగళ్లపల్లి మండల అధ్యక్షుడు ఏసిరెడ్డి రాంరెడ్డి, జిల్లా నాయకులు ఎగుమామిడి కృష్ణారెడ్డి, నారెడ్ల రాఘవ రెడ్డి, న్యాలకొండ రాఘవరెడ్డి, ఎడమల హనుమంత్‌రెడ్డి, కంది భాస్కర్‌రెడ్డి, కంకణాల శ్రీనివాసరెడ్డి, ఉమ్మారెడ్డి సత్యనారాయ ణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సిరిసిల్లలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి

తెర్లుమద్ది రైతుల ఆందోళన

ముస్తాబాద్, మార్చి 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్లుమద్ది గ్రామ చివరి ఆయకట్టు వరకు నీరు అందడం లేదంటూ ఆదివారం రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యువజన నాయకుడు బైతీ నవీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉన్న పదేళ్ల మానేరు కాలువ చివరి ఆయకట్టు వరకు నీళ్లు అందాయన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తప్ప ఇన్నేళ్ల ఏ ప్రభుత్వం పంటలకు మానేరు నీరు అందించ లేకపోయిందన్నారు. నీరు లేక పంట పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులను సంప్రదిస్తే వారినికి రెండు రోజులు విడుదల చేస్తామని చెప్పినా పది గంటలు కూడా నీరు రాలేదని ఆరోపించారు. ఇలాగే పరిస్థితి కొనసాగితే తహసీల్దార్ కార్యాలయాన్ని, అనంతరం ఇరిగేషన్ కార్యాలయాన్ని పెద్ద ఎత్తున రైతులతో ముట్టడిస్తామన్నారు. రైతులు అజ్మీర శంకర్ నాయక్, మదునూరి చంద్రయ్య, అంతడ్పుల దేవయ్య, ఉల్లి బాబు, బండిపల్లి చంద్రమౌళి, కట్ట అనిల్, టోవిటి బాబు, కొమ్మెట రాజు, దాసరి భూమేశ్ దితరులు పాల్గొన్నారు.



ముస్తాబాద్ మానేరు కెనాల్‌లో ఆందోళన చేస్తున్న రైతులు